


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 110,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శుక్రవారం, తేదీ : 21-08-2026

## అమెరికాది 'ఆర్థిక ఉగ్రవాదం': ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ ఘాటు స్పందన



సొంత దేశం సమస్యల నుంచి దృష్టి

మళ్లించేందుకే ట్రంప్ ప్రయత్నమని ఆరోపణ

అమెరికా అప్పు 40 ట్రిలియన్ డాలర్లకు చేరిందన్న ఇరాన్ విదేశాంగ మంత్రి

ఈ విధానాలు అమెరికా ఓటమికే దారితీస్తాయని వ్యాఖ్య

ఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆర్థిక హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అమెరికా చర్యలను ఆర్థిక ఉగ్రవాదంగా అభివర్ణించిన ఇరాన్, ఇవి ఆ దేశ పతనానికే దారితీస్తాయని హెచ్చరించింది. ఇరాన్‌పై ట్రంప్ ప్రకటించిన ఆర్థిక యుద్ధాన్ని ఆ దేశ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అమెరికా ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించేందుకే ఆ దేశ ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఇరాన్ అధికారులు ఆరోపించారు. భారీగా పెరిగిన అప్పులు, వడ్డీల భారం వంటి సంక్షోభాల నుంచి గట్టెక్కేందుకే మిగతా..2లో

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..
## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ




రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు

ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు

వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు

ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య

హైదరాబాద్ : తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మిగతా..2లో

## సీఎం నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా నిషేధిత జాబితాలోకి తెచ్చారు



- 22ఏ నిషేధిత జాబితా ఆధారంగా దోపిడీ జరుగుతోందన్న లక్ష్మణ్
- ఈ అంశంలో రాహుల్ గాంధీ, ఖర్గే జోక్యం చేసుకోవాలని విన్నపం
- కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి తెచ్చారని మండిపాటు

హైదరాబాద్: తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా ఆధారంగా భారీ భూదందాలు, దోపిడీ జరుగుతున్నాయని ఆరోపిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 22ఏ భూముల విషయంలో తప్పులు జరిగాయని ఒప్పుకుని మంత్రి క్షమాపణలు చెప్పడంపై లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అధికారులపై నెపం తోసి తప్పించుకోలేరని,

## కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై
# మహేశ్ గౌడ్ ఆగ్రహం

- పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు షోకాజ్ నోటీసు జారీ చేసిన మహేశ్ గౌడ్
- క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు ఉంటాయని వెల్లడి
- అందరూ పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచన



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణే ప్రధానమని, ఎంతటి వారైనా హద్దులు దాటి మాట్లాడితే చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత (మంత్రి కొండా సురేఖ కుమార్తె), కాంగ్రెస్ ఎమ్మెల్యేపై సీనియర్ నేత చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండా సుస్మిత వ్యవహారంలో ఆమె తల్లి, మంత్రి కొండా సురేఖకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరామని తెలిపారు. వారు ఇచ్చే వివరణ ఆధారంగా క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఎవరికి వారు తమకు తామే అభ్యర్థులుగా ప్రకటించుకోవడం సరికాదని చురకలంటించారు. కాంగ్రెస్‌లో సీట్ల కేటాయింపుకు స్పష్టమైన నియమావళి, ఎన్నికల కమిటీలు ఉంటాయని, అందరూ పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. 22ఏ భూముల వ్యవహారంలో కింది స్థాయిలో జరిగిన పొరపాటుపై మిగతా..2లో

## రూపురేఖలు మార్చే జహీరాబాద్ ప్రాజెక్ట్..
## 2028 నాటికి పూర్తికి తెలంగాణ సర్కార్ ప్లాన్



- జహీరాబాద్ స్మార్ట్ సిటీతో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాల లక్ష్యం
- 2028 మార్చి నాటికి మౌలిక సదుపాయాల పూర్తికి ప్రణాళిక
- మొదటి దశలో 3,245 ఎకరాల్లో పారిశ్రామిక నగరం నిర్మాణం
- ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై ప్రధాన దృష్టి
- హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా అభివృద్ధి

హైదరాబాద్: జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ద్వారా తయారీ రంగంలో సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని, తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 లక్షల ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2028 మార్చి నాటికి ఈ ప్రాజెక్టులో కీలకమైన మౌలిక మిగతా..2లో

## మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



ఢిల్లీ : కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్రమంగా క్షీణించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ల రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### మోదీ-అమిత్ షా జోడీ పట్టు కోల్పోయింది

కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, అధికారంపై పట్టు పూర్తిగా తగ్గిపోయాయని

## విశాఖ బీచ్ రోడ్ అభివృద్ధికి
# ప్రభుత్వం కట్టుబడి ఉంది

చేయడానికి తీసుకుంటున్న చర్యల గురించి ఆయన అడిగారు. దీనికి మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు.

ప్రత్యేక దృష్టి సారించనున్న పవన్ : పవన్ కల్యాణ్ తరఫున సభలో ప్రశ్నోత్తరాలు సమయంలో సమాధానం ఇచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్, విశాఖ కోస్టల్ జోన్ మేనేజ్ మెంట్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ రెండుసార్లు వాయిదా పడిందన్నారు. సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారనీ చెప్పారు. పవన్ కల్యాణ్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారనీ, మౌలిక సదుపాయాలు కల్పనలను టూరిజం అభివృద్ధిలోనూ ప్రత్యేక చర్యలు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి




మనోహర్ సభలో వివరించారు.

### విశాఖ బీచ్ రోడ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

"విశాఖ బీచ్ రోడ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది . పవన్ కల్యాణ్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. విశాఖ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ కోసం సెప్టెంబర్ 2 ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు అంతా సహకరించాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు"

## నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం- పోలీసుల చర్యలపై
# ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ

- జంతర్ మంతర్‌లో పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- ఐదుగురి సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు
- ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ



ఢిల్లీ : నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా చలో పార్లమెంట్ చేపట్టిన ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఆయనతో మిగతా..2లో

## భద్రతలో మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలి



- ఈ నెల 16 న 8 మంది మత్స్యకారులు
- వేటకు వెళ్లగా సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం
- ఈ ఘటనలో గల్లంతైన అప్పన్న

అమరావతి: : సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని సూచించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపై ఆరా : ఈ నెల 16న 8 మంది మత్స్యకారులు వేటకు వెళ్లగా సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని

## వికసిత్ భారత్ నిర్మాణంలో
# దక్షిణాది కీలక ఆర్థికశక్తిగా ఎదగాలి

- తమిళనాడులో హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం
- ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిని ప్రస్తావించిన సీఎం చంద్రబాబు
- దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని వెల్లడి




అమరావతి : తమిళనాడులోని మామల్లపురం (మహాబలిపురం)లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళం సీఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు, మిగిలిన ముఖ్యమంత్రులు కలుసుకున్నారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలు, కేటాయింపులు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రధానంగా నీట్ వివాదం, మిగతా..2లో

## విశాఖ బీచ్ రోడ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




- అసెంబ్లీ సమావేశాల చివరి రోజు
- తీరప్రాంత మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే ప్రశ్నలు సంధించారు
- దీంతో సమాధానాలు ఇచ్చిన మంత్రి నాదెండ్ల

అమరావతి : విశాఖ బీచ్ రోడ్ లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి బీచ్ డెవలప్‌మెంట్ పై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ అసెంబ్లీలో స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజున 'ప్రశ్నోత్తరాల సమయం' లో ఎమ్మెల్యే చింతలపూడి వంశీకృష్ణ శ్రీనివాస్ తీర ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలను లేవనెత్తారు. బీచ్ రోడ్డు వెంబడి ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సౌకర్యాలు, పర్యాటక మౌలిక సదుపాయాలు, తీర రక్షణ పనులకు సంబంధించి అనుమతులను వేగవంతం మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

శుక్రవారం 21-08-2026

మొదటి పేజి తరువాయి

## భద్రతలో మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలి

అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు.

## మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ విమర్శించారు. గతంలో ఆ పార్టీ ప్రదర్శించిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ప్రస్తుతం కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ మరియు 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

### ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలి

రాబోయే కాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని ఆయన సూచించారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా ఆయన ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

## కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఆగ్రహం

ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయం తమ ప్రభుత్వం దృష్టికి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

## రూపురేఖలు మార్చే జహీరాబాద్ ప్రాజెక్ట్.. 2028 నాటికి పూర్తికి తెలంగాణ సర్కార్ ప్లాన్

సదుపాయాలను పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల వెల్లడించారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు సంస్థ (నిక్డిట్) సమావేశంలో తెలంగాణ సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి ఈ వివరాలను తెలిపారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉండేలా జహీరాబాద్ పారిశ్రామిక నగరాన్ని తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొదటి దశలో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 17 గ్రామాల్లో 12,635 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఇండస్ట్రియల్ నోడ్, జహీరాబాద్ పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) నివేదిక ప్రకారం, మొదటి దశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 1,90,031 ఉద్యోగాల కల్పనను అంచనా వేశారు. ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం.. సుమారు 1,939 ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు, 55 ఎకరాలను లాజిస్టిక్స్ కోసం, 607 ఎకరాలను పచ్చదనం కోసం కేటాయించారు. మిగిలిన భూమిని రోడ్లు, వాణిజ్య, నివాస భవనాలు, ఇతర ప్రజా సౌకర్యాల కోసం వినియోగించనున్నారు. ఆటోమొబైల్స్, రవాణా పరికరాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, లోహాలు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలను ఇక్కడ ప్రధానంగా ప్రోత్సహించనున్నారు. జాతీయ రహదారి 65కి సమీపంలో ఉండటం పరిశ్రమలకు రవాణా సౌకర్యాన్ని పెంచనుంది. ఇదే స్మార్ట్ సిటీలో హ్యుండాయ్ గ్రూప్ రూ.8,500 కోట్లతో గ్లోబల్ ఇన్నోవేషన్, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుందని శ్రీధర్ బాబు గత జూన్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ప్రకటించిన రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 2 లక్షల ఉద్యోగాలు కేవలం ప్రాజెక్ట్ లక్ష్యాలు మాత్రమేనని, ఇప్పటికే ఖరారైన ఒప్పందాలు కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'భారత్ ఉద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) కింద రాష్ట్రంలోని నాలుగు పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సహకారం అందించాలని శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం మౌలిక వసతుల పనుల కోసం ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ కాంట్రాక్టును జీవీపీఆర్-ఎస్ఆర్ఆర్ (జేవీ) సంస్థకు అప్పగించడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టుతో జహీరాబాద్‌ను ఒక ప్రధాన తయారీ కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

## అమెరికాది 'ఆర్థిక ఉగ్రవాదం': ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ ఘాటు స్పందన

ట్రంప్ ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించారు. అమెరికా సాగిస్తున్న 'ఆర్థిక ఉగ్రవాదం' ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, వివిధ దేశాల సార్వభౌమాధికారానికి పెను ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. అమెరికా అప్పులు సుమారు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని గుర్తు చేస్తూ, ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు ఆ దేశ రుణభారాన్ని మరింత పెంచుతాయని విమర్శించారు. ఇరాన్‌కు సహకరించే దేశాలు తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఇరాన్‌ను ఒంటరిని చేసి ఓడించేందుకు మిత్రదేశాలన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, ఇరాన్ ఎప్పటికీ అణు ఆయుధాలను సమకూర్చుకోకూడదని స్పష్టం చేశారు. అయితే, ఇటువంటి విఫల విధానాల వల్ల అమెరికాకు మరిన్ని పరాజయాలు తప్పవని ఇరాన్ దీటుగా సమాధానమిచ్చింది.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ

తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## నీట్ నుంచి తమిళనాడును మినహాయించండి..

తమిళనాడు వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో దక్షిణాది ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కేంద్ర ప్రభుత్వం ముందు పలు కీలక డిమాండ్లు, అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

నీట్, ప్రతిపాదిత డీలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక న్యాయం, కావేరీ జలాలపై తమిళనాడు హక్కులు వంటి అంశాలను ప్రస్తావించారు.

నీట్‌ను వ్యతిరేకించిన విజయ్

ఇటీవల నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో విద్యార్థుల ఆందోళనలు జరుగుతున్న వేళ.. విజయ్ మరోసారి తమిళనాడు ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. నీట్ కారణంగా గ్రామీణ ప్రాంతాలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు నష్టపోతున్నారని.. గ్రామీణ ప్రాంతాలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నీట్ ప్రతికూలంగా మారుతోందని తెలిపారు. పాఠశాల విద్య ఆధారంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించే తమిళనాడు విధానాన్ని ఇది దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. తమిళనాడు కోటాలోని వీడీఎం, డీఎం, ఎంఎస్ కోర్సుల సీట్లన్నింటినీ కేవలం 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసుకునేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. ఇక ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియపైనా విజయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణలో విజయవంతమైన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గించడం ఒక రకంగా శిక్షించినట్లేనని అన్నారు. అలాగే సమావేశంలో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కూడా పాల్గొన్న నేపథ్యంలో.. తమిళనాడుకు సంబంధించిన కావేరీ జలాల అంశాన్ని విజయ్ ప్రస్తావించారు. కావేరీ వంటి నదుల దిగువ ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాలు, నదీ ప్రవాహాలపై ఆధారపడిన ప్రజల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ట్రిబ్యునల్ అవార్డులు, నదీ జలాల నిర్వహణకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థలను అక్షరాలా అమలు చేయాలని కోరారు. రాబోయే ఫైనాన్స్ కమిషన్‌ను దృష్టిలో పెట్టుకుని దక్షిణాది రాష్ట్రాలకు సమానమైన ఆర్థిక న్యాయం చేయాలని విజయ్ డిమాండ్ చేశారు. అభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థికశక్తిగా ఎదగాలి

మొదటి పేజి తరువాయి




కావేరీ జలాలు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధిపై సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదనలు చేశారు. కేంద్రంరాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును కుప్పం మీదుగా అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ కారిడార్‌తో పాటు అమరావతిబెంగళూరుచెన్నై రవాణా వ్యవస్థకు చంద్రబాబు ప్రతిపాదన చేశారు. ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్ట్ లు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం, యూనివర్సిటీలుస్కిల్లింగ్ సంస్థల ఉమ్మడి కన్సార్టియం, విపత్తుల సమయంలో పరస్పర సహకారానికి మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ను చంద్రబాబు ప్రతిపాదించారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతమని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థికశక్తిగా ఎదగాలని చెప్పారు. ఏపీకి సంబంధించిన విభజన సమస్యలను వేగంగా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి, విశాఖవిజయవాడ మెట్రో, దుగరాజుపట్నం పోర్టు, రిఫైనరీ, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు కేంద్ర సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. గోదావరికావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించి తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. గంగాకావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళికతో పాటు కాలపరిమితి కలిగిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కోరారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని చెప్పారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది సీఎంలు ప్రశంసించారు. ఒక సీనియర్ నాయకుడిగా ఆయన విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధిపై మాట్లాడారని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కొనియాడారు.

# సీఎం నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా నిషేధిత జాబితాలోకి తెచ్చారు: లక్ష్మణ్

మొదటి పేజి తరువాయి

ఎవరి ఆదేశాల మేరకు లక్షలాది మంది ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ భూముల కేటాయింపులు, తొలగింపుల్లో వేల కోట్ల రూపాయల దందాలు జరుగుతున్నాయని, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం 22ఏ జాబితాపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి నివాసం ఉండే ప్రాంతాన్ని కూడా ఈ నిషేధిత జాబితాలోకి చేర్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కోటి ఎకరాలను ఈ పరిధిలోకి తెచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడటంలో విఫలమైందని, కాంగ్రెస్ పాలన రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని మండిపడ్డారు.



# నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం- పోలీసుల చర్యలపై ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ

మొదటి పేజి తరువాయి

పాటు పంజాబ్ హరియాణా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌కే ఝా,

ఢిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కే శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్ఆర్ బిష్ణోయ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది. మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది. "ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు



సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. న్యాయ చేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా న్యాయ అంచనా వేయవచ్చు. అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. న్యాయ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఆరోపణలపై అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో విస్తృత సంస్కరణలు కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (జజీపీ) ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే జూలై 20న ఢిల్లీలో జజీపీ ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు జరిగిన ర్యాలీలో నిరసనకారులు- భద్రతా సిబ్బంది మధ్య ఘర్షణలు జరిగాయి. పార్లమెంటు వైపు వెళ్లడానికి ప్రయత్నించిన గుంపులను చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీలు, బాష్పవాయువు షెల్స్‌ను ఉపయోగించారు. ఆ తర్వాత నిరసనకారులను పోలీసు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లుగా ఉన్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆందోళనల్లో మితిమీరిన బలప్రయోగం జరిగిందనే ఆరోపణలకు దారితీసింది. ఈ క్రమంలోనే దీనిపై పిటిషన్ దాఖలు చేయగా సుప్రీం విచారణ చేపట్టి తాజాగా అత్యున్నత స్థాయి విచారణ కమిటీని నియమించింది.

# విశాఖ బీచ్ రోడ్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటి పేజి తరువాయి




-నాదెండ్ల మనోహర్, మంత్రి అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలి : రిషికొండ నుంచి భీమిలి వరకు బీచ్ ఫ్రంట్ అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు ఉన్నాయని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో చిన్న కట్టడాలు చేయాలన్న తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. విశాఖ బీచ్ రోడ్ లో అభివృద్ధికి ఆటంకం లేకుండా చూడాలనీ కోరారు. ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. సిఆర్ జెడ్ నిబంధనల వల్ల పర్యావరణ సమతుల్యం, అభివృద్ధి మధ్య సమన్వయం ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. విశాఖ నుంచి భీమిలి తీరానికి బీచ్ ఫ్రంట్ అభివృద్ధికి సరళంగా నిబంధనలు ఉంటే వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని గంట శ్రీనివాసరావు అన్నారు. సిఆర్ జెడ్ జోన్ మూడు నుంచి రెండుకు మార్చాలనీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు.

### విరాళాల దోపిడీకి రామమందిర ట్రస్ట్ సరిపోలేదా?' నిధిపై ఖర్గే ప్రశ్నలు

2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని ఖర్గే వెల్లడి- అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ప్రశ్న అయోధ్య రామమందిర విరాళాల చోరీ, పీఎం కేర్స్ నిధి వినియోగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు. నిధి, రామమందిర ట్రస్ట్ రెండూ ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే ప్రకటించాయని, రెండింటికీ విరాళాలు అందుతాయని ఆయన తెలిపారు. పీఎం కేర్స్ ట్రస్ట్ లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. ఆ ఏడాదిలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు కాగా, నిధిలో సుమారు రూ. 8,452 కోట్ల ముగింపు నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. 2024-25లో జరిగిన ఖర్చు నిధి ముగింపు నిల్వలో కేవలం 0.01 శాతం మాత్రమేనని ఖర్గే ఎక్స్ వేదికగా ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. పట్టించుకోరు ప్రజా జవాబుదారీతనం లేని ప్రభుత్వ వ్యవస్థనా? విరాళాల దోపిడీకి ఒక రామమందిర ట్రస్ట్ సరిపోలేదా అన్నట్లుగా ఉంది! గుర్తుంచుకోండి మోదీ, నిధిని, రామమందిర ట్రస్ట్‌ను ప్రకటించారు. మీ పర్యవేక్షణలోనే రెండింటికీ విరాళాలు అందుతున్నాయి!" అని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి నిధిలో రూ. 8,452 కోట్ల నిల్వ ఉందని ఖర్గే వెల్లడించారు. ఈ క్రమంలోనే నిధికి సంబంధించిన జవాబుదారీ విధానాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. (సమాచార హక్కు చట్టం) పరిధిలోకి రాదని, ఆడిట్ లేదా పార్లమెంటరీ జవాబుదారీతనానికి లోబడి లేదని ఆయన ఆరోపించారు. 2024-25లో నిధి నిల్వలో చాలా తక్కువ భాగం మాత్రమే ఖర్చయినప్పటికీ, అత్యవసర నిధిలో వేల కోట్లు ఎందుకు పోగుచేస్తున్నారని, దాని వెనుక ఉన్న కారణం ఏంటని ఖర్గే ప్రశ్నించారు. నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చు : ఖర్గే "ప్రధానమంత్రి ఈ ట్రస్ట్ కు చైర్మన్‌గా ఉన్నారు. రక్షణ, హోం, ఆర్థిక శాఖ మంత్రులు దీనికి ట్రస్టీలుగా ఉన్నారు. ఇది (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు, పన్ను మినహాయింపు పొందే విరాళాలను స్వీకరిస్తుంది. ప్రధానమంత్రి పేరుతో ఉన్న ఈ నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాల పరిధిలోకి ఎందుకు రాకుండా ఉందో వివరించాలి. ప్రధానమంత్రి పేరుతో ఉన్న నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాలకు ఎందుకు అతీతంగా ఉంది? 2024-25 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులో ఉన్న నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చయినప్పుడు, వేల కోట్ల రూపాయల అత్యవసర నిధిని పోగుచేయడంలో ఉన్న ఉద్దేశం ఏంటి?" అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీతో పాటు, స్వదేశీ, విదేశీ విరాళాలు కూడా ఈ నిధికి సమకూరాయని ఖర్గే వెల్లడించారు.

### పీఎం కేర్స్ ఫండ్ ఏంటి?


కొవిడ్-19 మహమ్మారి వంటి అత్యవసర, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి, అలాగే బాధితులకు ఉపశమనం కల్పించడానికి ఒక ప్రత్యేక ప్రజా స్వచ్ఛంద ట్రస్ట్‌గా 'ప్రధానమంత్రి సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిట్యుయేషన్స్ ఫండ్' ఏర్పాటు చేశారు. 2020 మార్చి 27న ఢిల్లీలో 'రిజిస్ట్రేషన్ చట్టం- 1908' కింద అధికారికంగా ఈ ట్రస్ట్ నమోదైంది. జాతీయ సంక్షోభ సమయాల్లో విరాళాలను స్వీకరించడానికి, సహాయాన్ని అందించడానికి ఒక కేంద్రీకృత వ్యవస్థగా ఇది పనిచేస్తుంది.

# ఇకపై బుజ్జగింపు రాజకీయాలు పనిచేయవు'- వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరిపై అమిత్

వందేమాతరం తొలి రెండు చరణాలనే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ- ఇది బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించిన అమిత్ షా - కాంగ్రెస్ నిర్ణయాన్ని దేశ ప్రజలు వ్యతిరేకించాలని అమిత్ షా పిలుపు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా

: జాతీయ గీతం వందేమాతం విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. వందేమాతరం తొలి రెండు చరణాలనే ఆలపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ పార్టీ మరోసారి బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయం దేశ విభజనకు దోహదపడిన ఒక చారిత్రక తప్పిదాన్ని పునరావృతం చేయడమేనని ఆరోపించారు. గురువారం ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేశారు. ' కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ బుధవారం ఒక అనూహ్యమైన, దేశ వ్యతిరేక నిర్ణయం తీసుకుంది. వందేమాతం గీతంలోని కేవలం రెండు చరణాలే పాడాలని వారు నిర్ణయించారు. ఇది 1937లో ముస్లింలను బుజ్జగించడం కోసం వందేమాతరం గేయాన్ని రెండుగా విడగొట్టి దేశ విభజనకు పునాది వేసిందనే విషయాన్ని నేను గుర్తు చేయాలని అనుకుంటున్నా. అప్పటి నుంచే ద్విజాతి సిద్ధాంతం బలపడింది. అదే చివరికి దేశ విభజనకు దారితీసింది. దీంతో పాకిస్థాన్ ఉద్భవించింది. ప్రస్తుతం మోదీ సర్కార్




కాంగ్రెస్ చేసిన ఆ చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దింది. వందేమాతర గేయాన్ని పూర్తిగా ఆలపించడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతడం చేయడానికి ప్రయత్నించింది. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని పూర్తిగా ఆలపించాలన్న నిర్ణయానికి చట్టరూపంలోకి తీసుకొచ్చారు' అని అమిత్ షా తెలిపారు. 'కాంగ్రెస్ చేసిన తప్పును మోదీ సర్కార్ సరిదిద్దింది' కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ విస్మరించాలని నిర్ణయించుకుందని అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం వారి తీవ్ర బుజ్జగింపు రాజకీయ విధానాన్ని ధ్రువీకరిస్తోందని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారు వందేమాతరాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీని మాత్రమే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' అంటూ ప్రాణత్యాగం చేసిన లక్షలాది మంది వీరులను కాంగ్రెస్ అవమానిస్తోందని విమర్శించారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దాని ప్రాధాన్యతను ప్రజలకు గుర్తు చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం విచారకరమని అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు ఈ నిర్ణయంపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న సమయంలో బుజ్జగింపు రాజకీయాలను ప్రజలు అంగీకరించరని అన్నారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రజల్లోకి వెళ్లి దీనిపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

'కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం'

కాంగ్రెస్ పార్టీ 1937 నాటి తమ పార్టీ తీర్మానాన్ని ఆమోదించి పార్లమెంట్ చట్టాన్ని తిరస్కరిస్తోంది. దేశంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహించడం తనకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ఒకసారి వందేమాతరాన్ని రెండుగా విడగొట్టినందుకు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఇప్పుడు అలాంటి తప్పు జరగకుండా చేసేందుకు దేశ ప్రజలు ఏకం కావాలని, కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. బుజ్జగింపు రాజకీయాలు ఇక పనిచేయవు అని మనమంతా చాటిచెప్పాలని అన్నారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే ఈ విధానాన్ని కొనసాగిస్తున్నామని పార్టీ వెల్లడించింది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు నుంచే వందేమాతరం

## పి.కొట్టాంలో పీహెచ్‌సీ నిర్మాణానికి కదలిక ఎప్పుడు?

### అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించిన ప్రభుత్వ విప్ యనమల దివ్య. త్వరగా పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**తుని, ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్: :** తుని నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న ప్రభుత్వ విప్ యనమల దివ్య.. కోటనందూరు మండలానికి సంబంధించిన మరో కీలక సమస్యను ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్తున్న ఆమె తీరుపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో మూడోసారి మాట్లాడే అవకాశం దక్కించుకున్న యనమల దివ్య.. కోటనందూరు మండలం పి.కొట్టాంలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే స్థలాన్ని రోడ్లు భవనాల శాఖకు అప్పగించినప్పటికీ, ఇప్పటివరకు శంకుస్థాపన జరగలేదని తెలిపారు. ప్రస్తుతం కోటనందూరులో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని, పి.కొట్టాం పరిసర గ్రామాల ప్రజలకు అక్కడికి వెళ్లడం దూరాభారంగా మారుతోందని యనమల దివ్య పేర్కొన్నారు. తన అభ్యర్థన మేరకు ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు పి.కొట్టాంలో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలంటే పి.కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు.

## విభేదాలను పక్కనపెట్టి వైసీపీ కోసం కలిసికట్టుగా పనిచేయాలి

### స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి జగన్‌కు గిఫ్ట్ ఇవ్వాలి: యనమల కృష్ణుడు



**తుని, ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తునిలో వైసీపీ నేత యనమల కృష్ణుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వారం రోజులుగా పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. పార్టీలో చిన్నచిన్న విభేదాలు ఉండటం సహజమేనని, అయితే పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని యనమల కృష్ణుడు అన్నారు. ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే పార్టీ పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రతిపక్ష వైసీపీకి వ్యతిరేకంగా అధికారంలో ఉన్న మూడు పార్టీలు కలిసి పోరాడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం విమర్శలు చేసుకోవడం వల్ల పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకుని వైసీపీ అధినేత జగన్‌కు గిఫ్ట్ ఇవ్వాలని యనమల కృష్ణుడు పిలుపునిచ్చారు. ఒకచోట పది మంది నాయకులు ఉన్నప్పుడు అభిప్రాయ భేదాలు రావడం సహజమేనని, వాటిని పార్టీకి నష్టం కలగకుండా పరిష్కరించుకోవాలని చెప్పారు. కేడర్ మొత్తం ఐక్యంగా పనిచేసి అధినేత జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. పార్టీని కుటుంబంగా భావించాలని, పార్టీకి నష్టం జరిగితే దాని ప్రభావం ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని పేర్కొన్నారు. అందరూ వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీని దృష్టిలో ఉంచుకుని కలిసికట్టుగా పనిచేయాలని యనమల కృష్ణుడు కోరారు.

## పాయకరావుపేటలో నాలుగు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు

### వాటర్ ట్యాంక్ వాల్‌కు వెంటనే మరమ్మతులు చేయాలి.. పంచాయతీ కార్యదర్శికి వైసీపీ నాయకుల వినతి



**పాయకరావుపేట ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట పట్టణంలోని మంగవరం రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద వాల్ దెబ్బతినడంతో గత నాలుగు రోజులుగా సమీప ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని వైసీపీ నాయకులు జగతా శ్రీను తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగతా శ్రీను మాట్లాడుతూ మంగవరం వెళ్లే మార్గంలోని వాటర్ ట్యాంక్ వద్ద వాల్ మరమ్మతులకు గురై నాలుగు రోజులు గడిచినా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని అన్నారు. నిధుల కొరత, బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు వంటి కారణాలను చూపుతూ పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వాల్ మరమ్మతులకు అవసరమైన నిధులను తాను సమకూరుస్తానని పంచాయతీ కార్యదర్శికి తెలిపినట్లు జగతా శ్రీను చెప్పారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మరమ్మతు పనులను త్వరగా చేపట్టి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా పాయకరావుపేట పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు కూడా అధ్వానంగా ఉన్నాయని ఆయన తెలిపారు. పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో పాటు కాలువల్లో మురుగునీరు నిలిచిపోతోందని పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి అందజేసిన ఫిర్యాదులో కోరినట్లు జగతా శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో జె. శ్రీను, తుమ్మలపల్లి సతీష్, పోసిన వీరబాబు, కోసూరు మధు, జే. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రైయ్ రైయ్ మంటున్న సోమిరెడ్డి అవినీతి




**నెల్లూరు జిల్లా ఆగష్టు 20 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి అవినీతి అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది.సోమిరెడ్డి తో పాటు సోమిరెడ్డి కొడుకు సోమిరెడ్డి అల్లుడు ముగ్గురు కలిసి సర్వేపల్లిని దోచుకుంటున్నారు. సర్వేపల్లి లోని సహజ వనరులు, ప్రకృతి సంపదను దోచుకుంటూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు.సర్వేపల్లి నియోజకవర్గం లో, ఎటు చూసినా అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్ టిప్పర్ల సందడి తప్ప, అభివృద్ధి, సంక్షేమం ఊసే కనిపించడం లేదు.సోమిరెడ్డి దిగిపోయే నాటికి సర్వేపల్లి మొత్తం దోపిడీకి గురవుతుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్వేపల్లి ప్రజానీకం.సోమిరెడ్డి బాహాటంగా తనకు పదవులు అవసరం లేదని, ధన సంపాదనే ధ్యేయంగా పనిచేస్తానని బాహాటంగానే మాట్లాడడం తెలుగుదేశం పార్టీ నేతలకు కూడా విస్మయం కలిగిస్తుంది.సోమిరెడ్డి కుటుంబం దోపిడీతో, సర్వేపల్లి పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదని తీవ్ర ఆందోళనలో సర్వేపల్లి ప్రజలు.

## శివారు ప్రాంతాలను ప్రాధాన్యతా క్రమంలో ప్రణాళికబద్దంగా అభివృద్ధి చేస్తున్నాం బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్**

సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధి అపర్ణ పామ్ మెడోస్, అపర్ణ పామ్ గ్రోస్ నందు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామపంచాయతీ స్థాయిగా ఉన్న కొంపల్లిని ప్రణాళికాబద్ధంగా, ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసుకుంటూ నేడు కార్పొరేషన్ స్థాయికి అభివృద్ధి పరిచాం. కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి 12 ఏళ్ల కాలంలో నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలను ఎంతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా అపర్ణ పామ్ మెడోస్, అపర్ణ పామ్ గ్రోస్ నందు ప్రధాన రోడ్డు తో పాటు అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి అపర్ణ పామ్ మెడోస్, పామ్ గ్రోస్ తో పాటుగా కొంపల్లి డివిజన్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ విరాట్, టీపీవో వీణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సువర్ణ, ప్రవీణ్, వినోద్, చింతల దేవేందర్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు సంగీత రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, వినోద్, ప్రవీణ్, షన్ను భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సూరవరంలో పరదేశమ్మ జాతర సందడి.. 108 కలశాలతో పల్లకి సేవ..

### 26న అంగరంగ వైభవంగా జాతర.. 30న ప్రత్యేక డ్రాలో అదిరిపోయే బహుమతులు

### 41వ జాతర మహోత్సవాలకు ఘన ఏర్పాట్లు..



**తుని, ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్:** కాకినాడ జిల్లా కొత్త సూరవరం ఎస్.అన్నవరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పరదేశమ్మ అమ్మవారి 41వ జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం 108 కలశాలతో పల్లకి సేవ నిర్వహించారు. శ్రీ పరదేశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అమ్మవారిని సన్నాయి మేళాలు, కోలాట నృత్యాలు, తీన్మార్ డప్పులు, శక్తి వేషాలతో పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు.108 కలశాలకు సంబంధించిన కొబ్బరి బొండాలు, జాకెట్ ముక్కలు, గాజులు తదితర సామగ్రిని కొత్త సూరవరం శ్రీ పరదేశమ్మ ఆలయం వద్ద భక్తులకు అందజేశారు. జాతర మహోత్సవాల్లో భాగంగా 22వ తేదీ శనివారం మాలధరించిన భక్తులచే పడిపూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 23వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు శ్రీ పరదేశమ్మ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ముందుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, ముగ్గులకు అవసరమైన సామగ్రిని వారే తీసుకురావాలని సూచించారు. 26వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గరగలాటలు, తప్పెడు గుళ్లు, కూచిపూడి నృత్యాలు, బుర్రకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బాణాసంచా ప్రదర్శన, అఖండ విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 27వ తేదీ గురువారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనం, తీర్థం అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.జాతరలో భాగంగా 30వ తేదీ ఆదివారం సాయంత్రం 7 గంటలకు కొత్త సూరవరం వినాయకుని ఆలయం వద్ద గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో ప్రత్యేక డ్రా నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రాలో విజేతలకు మొదటి బహుమతిగా సైకిల్, రెండో బహుమతిగా ఫ్రిడ్జ్, మూడో బహుమతిగా హోండా యాక్టివా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పాయకరావుపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 40-50 పేద కుటుంబాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సీపీఎం ధర్నా

### విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేసి చీకటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్




**పాయకరావుపేట, ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నివసిస్తున్న 40 నుంచి 50 పేద కుటుంబాలకు విద్యుత్ సరఫరా మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పాయకరావుపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సుమారు 40 ఏళ్లుగా పేద కుటుంబాలు పూరి గుడిసెల్లో నివసిస్తున్నాయని తెలిపారు. ఆయా కుటుంబాలకు ఆధార్ కార్డులు, ఓటు హక్కు ఉన్నప్పటికీ విద్యుత్ మీటర్లు మంజూరు కాలేదన్నారు. సుమారు 12 సంవత్సరాల క్రితం మీటర్లు ఏర్పాటు చేసినప్పటికీ, అనంతరం ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకెళ్లిందని తెలిపారు.ప్రస్తుతం అక్కడి ఆరుగురికి విద్యుత్ మీటర్లు ఉండటంతో వారికి విద్యుత్ సదుపాయం అందుబాటులో ఉందని చెప్పారు. విద్యుత్ శాఖ ఏఈని సంప్రదించగా, అవసరమైన ఎన్‌ఓసీ అందిస్తే మిగిలిన పేద కుటుంబాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపినట్లు ఎం. సత్యనారాయణ పేర్కొన్నారు. పేద కుటుంబాలను గుర్తించి వారికి విద్యుత్ సదుపాయం కల్పించాలని, దోమలు, పాములు వంటి ఇబ్బందుల మధ్య నివసిస్తున్న కుటుంబాలకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరారు. ఆయా కుటుంబాలు ఎస్సీలు కావడంతో సబ్సిడీతో కూడిన విద్యుత్ మీటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలకు కూడా పేద ప్రజలే ఎన్‌ఓసీలు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎం. సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ముందు ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ, ప్రస్తుతం ప్రతి సమస్య కోసం ప్రజలు అధికారులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు.ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, మీటర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రజలకు చీకటి నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. దోమలు, పాములు, ఈగల సమస్యల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్సీ నియోజకవర్గమైన పాయకరావుపేటలో హోమ్ మినిస్టర్ గారి సారథ్యంలో పేద కుటుంబాలకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరారు.దళితులు ఇప్పటికీ ఇల్లు, విద్యుత్, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు,స్మశానవాటిక వంటి మౌలిక వసతుల కొరతను ఎదుర్కొంటున్నారని ఎం. సత్యనారాయణ తెలిపారు. గత 80 సంవత్సరాలుగా పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 80వ సంవత్సరంలోనైనా పేద కుటుంబాలకు విద్యుత్ స్తంభాలు, కరెంట్ మీటర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి వారి జీవితాల్లో వెలుగు తీసుకురావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లావమ్మ, యేసురత్నం, బుజ్జమ్మ, అంజమ్మ, ఆకుల లలిత, భారతి, సంధ్య, మంజు, మనీ, మరియమ్మ, అప్పారావు, బాబ్జి, రాజు, నంద తదితరులు పాల్గొన్నారు.

## తేటగుంటలో ఘనంగా మహా వరుణయాగం

### వేద మంత్రాలు, హోమాలతో ఆధ్యాత్మిక వైభవం

### రైతు సుభిక్షం, సమృద్ధిగా వర్షాల కోసం యనమల రామకృష్ణుడు, యనమల దివ్య సారథ్యంలో యాగం



**తుని,(తేటగుంట) ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తేటగుంటలోని యనమల గార్డెన్స్‌లో రైతు సుభిక్షం, సమాజ శ్రేయస్సు, వరుణ కటాక్షం కోసం నిర్వహిస్తున్న మహా వరుణయాగం రెండో రోజు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. వేద మంత్రాల ఘోష, హోమాలు, జల జపం, ఋత్వికుల అభిషేకాలతో యాగ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ప్రజాహితం కోసం మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య సారథ్యంలో యనమల గార్డెన్స్‌లో త్రయాహ్నిక దీక్షతో వరుణయాగం నిర్వహిస్తున్నారు. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా రైతు కుటుంబాలకు చెందిన దంపతులు ఋష్యంగ మహర్షికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒకవైపు ఋత్వికులు హోమ కార్యక్రమాలను నిర్వహించగా, మరోవైపు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రైతు కుటుంబాల దంపతులచే అభిషేకాలు కొనసాగాయి. యాగం ప్రారంభం నుంచి మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ పాల్గొన్నారు. మహా వరుణయాగం జరుగుతున్న ఆధ్యాత్మిక వైభవాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో రైతు ప్రతినిధులు యనమల గార్డెన్స్‌కు తరలివచ్చారు. వరుణుడి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు.రైతులు, సర్వజీవుల క్షేమం కోసం యనమల రామకృష్ణుడు తలపెట్టిన వరుణయాగాన్ని జిల్లా ప్రముఖులు సందర్శించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబుతో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు యాగ కార్యక్రమంలో పాల్గొన్నారు.వారు ఋష్యంగ మహర్షిని దర్శించుకుని వరుణ కటాక్షం కోసం ప్రార్థించారు. యనమల గార్డెన్స్‌లో జరుగుతున్న వరుణయాగం ఫలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, లోవ దేవస్థానం చైర్మన్ పెంటకోట భాస్కర సత్యనారాయణ ఆకాంక్షించారు. రైతు సంక్షేమం కోసం యనమల చేపట్టిన మహా సంకల్పం అభినందనీయమని వారు పేర్కొన్నారు.యనమల గార్డెన్స్‌లో రెండో రోజు జరిగిన వరుణయాగ పూజా కార్యక్రమాలను ఐవీ రోహిత్, పెంటకోట భాస్కర సత్యనారాయణ వీక్షించారు. యాగంలో పాల్గొన్న రైతు దంపతులను అభినందించారు. యనమల రామకృష్ణుడు నిండు మనసుతో చేపట్టిన ఈ మహాయజ్ఞం ఫలితంగా తుని నియోజకవర్గం సస్యశ్యామలంగా మారి రైతులు సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జస్టిస్ పున్నయ్య జయంతినాడు దళితుల గొంతు వినిపించిన అట్రాసిటీ కమిటీ




**అనంతసాగరం ఆగష్టు 20 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :**ఆత్మకూరు ఆర్డీవోకు వినతి ప్రతినెలా గ్రామసభల ఏర్పాటుకు విజ్ఞప్తి.ఆత్మకూరుకుల రహిత సమాజమే నా కల అని నినదించిన న్యాయమూర్తి జస్టిస్ కె. పున్నయ్య జయంతి రోజున దళిత, గిరిజన ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు రాజ రా అట్రాసిటీ పరిరక్షణ కమిటీ నేతలు.కమిటీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎన్. జయశ్రీ ఆధ్వర్యంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు బుధవారం ఆత్మకూరు ఆర్డీవో బి. పావనిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వివరణాత్మక వినతి పత్రంను ఆర్డీవోకు అందజేశారు.ప్రతినెలా పౌర హక్కుల దినోత్సవం పెట్టాలి ఈ సందర్భంగా కొప్పాల రఘు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య ఆశయ సాధన దిశగా ప్రతి నెల చివరి తేదీన రాజ రా నివాస కాలనీల్లో పౌర హక్కుల దినోత్సవ గ్రామ సభలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభలను స్థానిక మండల తహసిల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేసి, కాలనీల్లోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కోరారు.80 ఏళ్లకూ మారని కాలనీల దుస్థితి ఆత్మకూరు మండలంలోని గిరిజన కాలనీల్లో నేటికీ కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలులో జాప్యం ప్రధాన సమస్యలుగా ఉన్నాయని వివరించారు.ముఖ్యంగా మురగల్లు గ్రామం పోలయ్య కాలనీలోని 15 రా కుటుంబాల దుస్థితిని ఎత్తిచూపారు. తాగునీరు, విద్యుత్, ఇండ్లు లేక వారు అత్యంత దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారానికి హామీ వినతి పత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో బి. పావని స్పందిస్తూ లేవనెత్తిన అంశాలన్నింటినీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కార చర్యలు తీసుకుంటామని బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అడ్వైజర్ వి. వెంకటేశ్వర్లు, కమిటీ యూత్ ప్రెసిడెంట్ ఎర్రగుంట మాధవ్, మండల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీహరిపురంలో ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం..




**విశాఖపట్నం, ఆగస్టు 20: ప్రజా న్యూస్,విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.**

జీవీఎంసీ వెస్ట్ జోన్ పరిధి మల్కాపురం ఏరియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో గురువారం శ్రీహరిపురం వద్ద ప్రపంచ దినోత్సవం వేడుకల సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహణ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ మలేరియా ఇనిస్పెక్టర్ డి రవికుమార్ మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమ వలన మానవులకు మలేరియా వ్యాధి వ్యాపిస్తుందనే విషయాన్ని సర్ రోనాల్డ్ రాస్ని 1897 ఆగస్టు 20న కనుగొన్న సందర్భంగా ఆ రోజును గుర్తుచేసుకుంటూ ప్రతీ ఏడాది ఆగష్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక ప్రాంతం పరిధిలో గల ఏడు వార్డులలో జీవీఎంసీ మలేరియా, జిల్లా మలేరియా విభాగం సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్ గునియా వంటి వ్యాధుల నివారణకు ఎనలేని కృషి చేస్తూ ఆయా వ్యాధుల నివారణపై ప్రజలకు తగిన అవగాహణ కల్పిస్తున్నారన్నారు. అలాగే డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యుల ద్వారా కూడా సీజనల్ వ్యాధుల నివారణపై ఎప్పటికప్పుడు అవగాహణ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా సీజనల్ వ్యాధులపై తగిన అవగాహణ ఏర్పర్చుకొని నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి సీజనల్ రహిత విశాఖ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మలేరియా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనిస్పెక్టర్లు బి సునీల్ కుమార్, నవరత్నం, రమేష్, హెల్త్ సూపర్ వైజర్ గోపి, మలేరియా సూపర్ వైజర్ డి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ జగదీష్ తదితరులతో పాటు సచివాలయ హెల్త్, శానిటరీ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం

### పెద్ద పూలమాలతో సత్కరించిన ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్

### హుజూర్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** హుజూర్‌నగర్ పట్టణంలోని మండల ఎంపీడీవో కార్యాలయానికి రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి విచ్చేసిన సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్ద పూలమాలతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి రాక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్‌టీయూసీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యరగాని నాగన్న గౌడ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు మేళ్లచెరువు ముక్కంటి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

## దేశ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

## సద్భావన దివస్ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి** : భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని సద్భావన దివస్ సందర్భంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లి రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధి, ఆధునికీకరణకు రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా టెలికాం, కంప్యూటర్, ఆధునిక సాంకేతిక రంగాల అభివృద్ధికి దేశంలో బలమైన పునాది వేయడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లేందుకు ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు నేటి భారతదేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచే ఉద్దేశంతో ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని పేర్కొన్నారు. యువతకు విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషిని నాయకులు గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత, సద్భావన కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సద్భావన దివస్ సందర్భంగా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాజీవ్ గాంధీ ఆశయాలను సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ముఖ్యంగా హుజూర్‌నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లి రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ మన్సూర్ అలీ, మాజీ జాయింట్ సెక్రెటరీ అజీజ్ పాషా, దేశ్ముఖ అరుణ, జ్యోతి మోహన్, ముష్యం సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# కీర్తిశేషులు ములకలపల్లి చిన లక్ష్మయ్యకు నివాళులు

## పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలిపిన షేక్ మన్సూర్ అలీ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి** :హుజూర్‌నగర్ పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో ముదిరాజ్, మత్స్యకార సంఘం నాయకులు కీర్తిశేషులు ములకలపల్లి చిన లక్ష్మయ్య పెద్దకర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు షేక్ మన్సూర్ అలీ, డీసీసీ మాజీ కార్యదర్శి ఐల వెంకన్న గౌడ్ హాజరై చిన లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలిపారు.

# కోదాడలో 100 పడకల ఆసుపత్రి పనుల పరిశీలన

## నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

## ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచన

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**



కోదాడ పట్టణంలో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే కోదాడ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

## శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు హరిత ఫౌండేషన్ కృషి అభినందనీయం

## ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన పాఠశాలలకు బహుమతులు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సుమంత్రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు హరిత ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా తమలోని ప్రతిభను వెలికితీసుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో హుజూర్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో హుజూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్ ఎన్ఎస్పీ క్యాంప్ పాఠశాల, మూడవ స్థానంలో లింగగిరి పాఠశాల నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, ఫణిరాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

## ఆరుగురు నిందితుల అరెస్ట్.. 2 కిలోల గంజాయి స్వాధీనం

## ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు గంజాయి వినియోగించిన మరో నలుగురు అదుపులోకి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు గతంలో గంజాయి వినియోగించిన మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మొత్తం ఆరుగురు పోలీసుల పట్టుబడ్డారు. దాచారం గ్రామ శివారులోని ఎన్ఎస్పీ కాలువ వద్ద గంజాయితో అనుమానాస్పదంగా ఉన్న ఇంజమూరి రోహిత్ అలియాస్ దినేష్, కందుల శ్రీరాంలను నేరేడుచర్ల ఎస్సై గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 2 కిలోల గంజాయి లభించడంతో పాటు ఒక సెల్‌ఫోన్, ఒక మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి విక్రయించేందుకు తీసుకెళ్తున్నారు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఇంజమూరి రోహిత్ గంజాయిని కొనుగోలు చేసి కందుల శ్రీరాంకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఇద్దరిని ప్రధాన నిందితులుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి గతంలో గంజాయి సేవించిన మరో నలుగురిని కూడా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారికి సంబంధిత పరీక్షలు నిర్వహించగా గంజాయి




వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో వారిని డీ-అడిక్షన్ కేంద్రానికి పంపించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు కుటుంబాలపై, సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మాదకద్రవ్యాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, వినియోగానికి పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు నిఘా కొనసాగిస్తున్నామని, ఎక్కడైనా మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, కొనుగోలు చేస్తున్న వ్యక్తులు, విక్రయాల వెనుక ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించి పూర్తి నెట్‌వర్క్‌ను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వాహనాల తనిఖీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా, సమాచారం సేకరణ వంటి చర్యలను ముమ్మరం చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం వంటి ముఖ్యమైన అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని పోలీసులు సూచించారు. ఈ కేసులో పట్టుబడిన ఆరుగురి పాత్ర, గంజాయి సరఫరా మార్గాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలు, గంజాయి విక్రయాలకు సంబంధించిన నెట్‌వర్క్‌పై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజ్జె చరమంద రాజు, హుజూర్‌నగర్ ఎస్సై చలికంటి నరేష్, నేరేడుచర్ల ఎస్సై గోపాల్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నేరేడుచర్ల పోలీసుల చర్యలతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా మరింత కఠినతరం చేసినట్లు స్పష్టమవుతోంది.

# రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా

## దేశ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

## త్రిపురారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు

**త్రిపురారం మండల ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ :**



త్రిపురారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అలంపల్లి జానయ్య ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గోపగాని మాధవి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆధునిక సాంకేతిక రంగాల పురోగతి, యువతకు అవకాశాల కల్పన వంటి అనేక అంశాల్లో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా యువతను దేశ భవిష్యత్తుగా భావించి వారికి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని తెలిపారు. దేశ ప్రజలకు ఆయన చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు ఆయన చూపిన అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. దేశ సమగ్ర అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనుముల నర్సిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భారతి భాస్కర్ నాయక్, మాజీ ఎంపీపీ, మండల గౌరవ సలహాదారుడు అనుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బుచ్చిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్, మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పి.బి. రవి, ఎస్సీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవిరెండ్ల వీరయ్య, త్రిపురారం గ్రామ పార్టీ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, జి. చంద్రారెడ్డి, బిట్టు రవి, వి. సైదులు, బాలకృష్ణ, పి. నాగరాజు, పల్లెబోయిన రాము, పాండు నాయక్, మాజీ ఎంపీటీసీలు అంబటి రాము, కె. సాంబయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. జయంతి కార్యక్రమం అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు, కార్యకర్తలకు పండ్లను పంపిణీ చేశారు.

# కృష్ణా జలాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

## రూ.1,648 కోట్ల మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనుల పరిశీలన

## డిసెంబర్ నాటికి కీలక పనులు పూర్తి చేసి త్వరితగతిన సాగునీరు అందించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**

చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద రూ.1,648 కోట్ల వ్యయంతో చేపడుతున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన పాత వెల్లటూరు వద్ద ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు, ఇప్పటివరకు జరిగిన పురోగతి, భూసేకరణ, పంప్‌హౌస్ నిర్మాణం, సాగునీటి పంపింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. కృష్ణా నదిపై నిర్మిస్తున్న ఈ మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 53 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. 16 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి మట్టంపల్లి మండలంలోని 9 గ్రామాల్లో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలోని 5 గ్రామాల్లో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలోని 9 గ్రామాల్లో 16,705 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొత్తం 19,295 కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలగనుందని, ఇందులో 5,080 ఎస్టీ, 3,540 ఎస్సీ, 8,470 బీసీ, 2,205 ఓసీ కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా రూ.60 కోట్లు చెల్లించినట్లు మంత్రి వెల్లడించారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ను సమర్థవంతంగా వినియోగించుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని సాగుభూములకు నీరు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు సాగునీటి భరోసా పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ఈ ప్రాంత రైతుల చిరకాల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చేపడుతోందని తెలిపారు. డిసెంబర్ నాటికి ప్రాజెక్టు రూఫ్‌టాప్ లెవెల్, పంప్‌హౌస్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని, నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రాజెక్టు పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, నీటిపారుదల శాఖ అధికారులు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

## అభివృద్ధి, సంక్షేమ పథకాలతో హుజూర్‌నగర్‌ను రాష్ట్రంలోనే అగ్ర నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 20 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**



హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే అగ్ర నియోజకవర్గంగా నిలబెట్టడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ నియోజకవర్గంలో విద్య, గృహ నిర్మాణం, సాగునీరు, రహదారులు, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణాన్ని తమ ప్రభుత్వమే చేపడుతోందని, అదే విధంగా డిగ్రీ కళాశాల నిర్మాణానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా అవసరమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో నియోజకవర్గంలో 2,160 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రైతు సోదరులకు కూడా మంత్రి పలు సూచనలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతులకు అందుతున్న సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి వివరించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సహకారంతో హుజూర్‌నగర్‌ను తెలంగాణలోనే ఆదర్శ, అగ్ర నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.